www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
శనివారం
11-04-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 110
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

## రూ.400 కోట్ల భూమి ఆక్రమణ యత్నమా?

- పాఠశాల భవనం కూల్చివేతపై ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు
- 24 గంటల్లో కేసు నమోదు చేయక పోతే ఆందోళన హెచ్చరిక



2

# గ్రామ పాలనపై పట్టు చిక్కేదెలా?



### హాజరుకు వెనుకడుగు.. సర్టిఫికెట్ల వేటలో ముందుడుగు

## గాలికి సర్పంచుల శిక్షణ

- అభాసుపాలైన రెండు నెలల ట్రైనింగ్ పీరియడ్
- 20 శాతానికి మించి హాజరుకాని వైనం
- కేవలం రబ్బర్ స్టాంపుల్లా మారతారా?
- ప్రజా సమస్యలను ఎలా తీరుస్తారని ఓటర్ల ఆగ్రహం
- నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం

4

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పాలనను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్పంచుల శిక్షణా తరగతులు అభాసుపాలవుతున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి సర్పంచుల నుంచి స్పందన కరువైంది. రెండు నెలల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ ప్రక్రియలో నేర్చుకోవాల్సిన అంశాల కంటే, సర్టిఫికెట్లు పొందడానికే ఎక్కువ ప్రాధాన్యతని వ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- (ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)

## నందగోకుల్ గ్రామాన్ని.. అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

- సర్పంచ్ పాతూరి భానుప్రకాష్ రెడ్డి
- సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



2

## దళారులను నమ్మి మోసపోవద్దు

తిప్పనగుల్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



2



### "పార్కింగ్" పేరుతో
# ఓపెన్ బార్లు!

### రామచంద్రపురంలో వైన్స్ మాఫియా బహిరంగ దందా

- ఓపెన్ ప్లేస్‌లలో భారీ స్క్రీన్లు.. టేబుళ్ల ఏర్పాటు
- ఐపీఎల్ మ్యాచ్‌లను క్యాచ్ చేసుకొని దందా
- పర్మిట్ గదులకు మించి విస్తరణ
- కార్ల వద్దకే మద్యం సరఫరా
- అనుమతి లేని భవనాల్లో షాపులు

3

రామచంద్రపురం, ఏప్రిల్ 10 (సిరిన్యూస్): రామచంద్రపురం మండల పరిధిలో వైన్స్ షాపుల చుట్టూ జరుగుతున్న అక్రమాలు రోజురోజుకూ బహిరంగ రూపం దాల్చుతున్నాయి. "పార్కింగ్" పేరుతో చూపిస్తున్న ప్రదేశాలు పూర్తిస్థాయి ఓపెన్ బార్‌లుగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో కూర్చొని మద్యం సేవించడం, కార్ల దగ్గరకే మద్యం సరఫరా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు





# రూ.400 కోట్ల భూమి ఆక్రమణ యత్నమా?

- **పాఠశాల భవనం కూల్చివేతపై ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు**
- **24 గంటల్లో కేసు నమోదు చేయకపోతే ఆందోళన హెచ్చరిక**

**రామచంద్రపురం, ఏప్రిల్ 10 (సిరి న్యూస్):** పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ భవనం కూల్చివేత ఘటనపై మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, జిల్లా పరిషత్ సీఈవో కస్టడీలో ఉన్న ప్రభుత్వ భూమి కూల్చివేయబడినా ఇప్పటి వరకు అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా అధికారులు కనీసం ఘటనాస్థలాన్ని సందర్శించలేదని, విచారణ కూడా చేపట్టలేదని విమర్శించారు. “ఈ ఘటన వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయా..? ఎవరు ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు..? లోపల ఏమైనా ఒప్పందాలు జరిగాయా..?” అంటూ ఎంపీ ప్రశ్నించారు. చిన్న సంఘటనలకే కేసులు నమోదు చేసే పోలీసులు, వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి ధ్వంసం అయినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. “ఒక లారీ మట్టి తీసుకెళ్లినా వాహనాలను సీజ్ చేస్తారు. కానీ జేసీబీలు, హిటాచీలతో ప్రభుత్వ భవనాన్ని కూల్చివేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం” అని అన్నారు. జిల్లా కలెక్టర్‌తో ఈ విషయంపై మాట్లాడినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇంకా నివేదికలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిగా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. “తెలంగాణ పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నారని నమ్మకం ఉంది. నా ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, కూల్చివేతకు ఉపయోగించిన జేసీబీలు, హిటాచీలను సీజ్ చేయాలి. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి” అని ఎంపీ డిమాండ్ చేశారు. ఇంకా 24 నుంచి 48 గంటల్లో కేసు నమోదు చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. దోషులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## నందగోకుల్ గ్రామాన్ని.. అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతా

- **సర్పంచ్ పాతూరి భానుప్రకాష్ రెడ్డి**
- **సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం**

**రామాయంపేట, (నిజాంపేట)** ఏప్రిల్ 10 (సిరి న్యూస్) : గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆ గ్రామ సర్పంచు పాతూరి భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని నంద గోకుల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఏడు లక్షల నిధులు మంజూరు కాగా శుక్రవారం రోజున పనులు ప్రారంభించి మాట్లాడారు అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిసి రోడ్లు మంజూరు చేసిందని, పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని, నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి,ఉప సర్పంచు కుమార్, తదితర వార్డు సభ్యులు ఉన్నారు.





## సీనియర్ జర్నలిస్టు రాజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

**రామాయంపేట, ఏప్రిల్ 10 (సిరి న్యూస్)** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన TUWJ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డిని గురువారం నాడు పలువురు TUWJ (iju) నేతలు పరామర్శించారు. సంఘము రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. జి. శ్రీనివాస శర్మ, సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు రంగాచారి, మెదక్ జిల్లా శాఖ కోశాధికారి వుడేం దేవరాజు, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు బసన్న పల్లి మల్లేశం యాదవ్ తదితరులు రాజిరెడ్డిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**తిప్పనగుళ్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**రామాయంపేట, (నిజాంపేట)ఏప్రిల్ 10 (సిరి న్యూస్):** రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రకటించిన మద్దతు ధర పొందాలని తహసిల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిప్పనగుళ్ల,వెంకటాపూర్,బచ్చురాజ్ పల్లి, జెడ్ చెరువు తండా,నందగోకుల్ గ్రామాల్లో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యమని, ప్రతి ఒక్కరు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఏపీఎం అశోక్, ఆయా గ్రామాల సర్పంచులు మంగిలిపల్లి మంజుల, ముత్యాల సరిత, బాబు, చిమ్మనమైన శైలజ, సీసీ అమృత తదితరులు ఉన్నారు.






# "పార్కింగ్" పేరుతో ఓపెన్ బార్లు!

## రామచంద్రపురంలో వైన్స్ మాఫియా బహిరంగ దందా

- ఓపెన్ ప్లేస్‌లలో భారీ స్క్రీన్లు... టేబుళ్ల ఏర్పాటు
- ఐపీఎల్ మ్యాచ్‌లను క్యాచ్ చేసుకొని దందా
- పర్మిట్ గదులకు మించి విస్తరణ
- కార్ల వద్దకే మద్యం సరఫరా
- అనుమతి లేని భవనాల్లో షాపులు

**రామచంద్రపురం, ఏప్రిల్ 10 (సిరిన్యూస్): రామచంద్రపురం మండల పరిధిలో వైన్స్ షాపుల చుట్టూ జరుగుతున్న అక్రమాలు రోజురోజుకూ బహిరంగ రూపం దాల్చుతున్నాయి. "పార్కింగ్" పేరుతో చూపిస్తున్న ప్రదేశాలు పూర్తిస్థాయి ఓపెన్ బార్‌లుగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో కూర్చొని మద్యం సేవించడం, కార్ల దగ్గరకే మద్యం సరఫరా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు**




### అనుమతి లేని భవనాల్లో వ్యాపారం...

కొన్ని వైన్స్ షాపులు భవన అనుమతులు లేకుండానే తాత్కాలిక నిర్మాణాల్లో నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు లేకుండా వ్యాపారం కొనసాగడం ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. అనుమతులు లేని భవనాలతో పాటు నిబంధన ప్రకారం మద్యం దుకాణాలు ఉండాల్సిన ప్రాంతంలో కాకుండా వారికి నచ్చిన ప్రాంతంలో, జనావాసాల మధ్య మద్యం విక్రయాలు చేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### భారీ స్క్రీన్లు.. ఓపెన్ బార్‌లకు శ్రీకారం..

ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను ఆసరాగా చేసుకుని ఓపెన్ ప్లేస్‌లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచ్‌ల వీక్షణ పేరుతో టేబుళ్లను, కుర్చీలు ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవనానికి అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున గుంపులుగా చేరి హంగామా చేస్తున్నట్లు చెబుతున్నారు.

### పర్మిట్ గది పేరుతో మినీ బార్లు..

కొన్ని వైన్స్ షాపులు పర్మిట్ గదుల పరిమితులను పట్టించుకోకుండా పెద్ద హాళ్లు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో కస్టమర్లను కూర్చోబెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిబంధనల స్పష్టమైన ఉల్లంఘనగా భావిస్తున్నారు. భారీ స్థాయిలో షెడ్లను ఏర్పాటు చేసి మినీ బార్లుగా తీర్చిదిద్ది మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### కార్ల వద్దకే మద్యం సరఫరా..

పార్కింగ్ స్థలాల్లో కార్లలోనే మద్యం సేవించడం, షాప్ సిబ్బంది కార్ దగ్గరకే వెళ్లి మద్యం అందించడం బహిరంగంగా కొనసాగుతుంది. ఇది చట్టాలను బహిరంగంగా ఉల్లంఘించడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం యజమానులు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిగా అమ్మకాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మామూళ్ళ మత్తులో అధికారులు


ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలవారీగా సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్ళు అందుతున్నాయని, అందుకే మద్యం దుకాణాల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖతో పాటు సంబంధిత అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# గ్రామ పాలనపై పట్టు చిక్కేదెలా?

## గాలికి సర్పంచుల శిక్షణ



- అభాసుపాలైన రెండు నెలల ట్రైనింగ్ పీరియడ్
- 20 శాతానికి మించి హాజరుకాని వైనం
- కేవలం రబ్బర్ స్టాంపుల్లా మారతారా?
- ప్రజా సమస్యలను ఎలా తీరుస్తారని ఓటర్ల ఆగ్రహం
- నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం

**హాజరుకు వెనకడుగు.. సర్టిఫికెట్ల వేటలో ముందుడుగు**

**(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పాలనను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్పంచుల శిక్షణా తరగతులు అభాసుపాలవుతున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి సర్పంచుల నుంచి స్పందన కరువైంది. రెండు నెలల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ ప్రక్రియలో నేర్చుకోవాల్సిన అంశాల కంటే, సర్టిఫికెట్లు పొందడానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.**

### పాలనపై పట్టు కోసం శిక్షణ.. కానీ అసలుకే ఎసరు..

ప్రతి సంవత్సరం పంచాయతీ రాజ్ శాఖ గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ నూతన సర్పంచులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తుంది. ఇందులో భాగంగా సుమారు 10 మంది టెక్నికల్ ఆఫీసర్లు శిక్షకులుగా వ్యవహరిస్తూ, గ్రామాల్లో పాలన ఎలా కొనసాగించాలి? పరిపాలనపై పట్టు ఎలా సాధించాలి? అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ఏ విధంగా ఖర్చు చేయాలి గ్రామాలను అభివృద్ధి బాటలో ఎలా నడపాలి అనే కీలక విషయాలను ఈ శిక్షణలో బోధిస్తారు. అయితే ఇంతటి ప్రాధాన్యత ఉన్న కార్యక్రమానికి సర్పంచులు మొహం చాటేయడం గమనార్హం.

### 20 శాతం మించని హాజరు..

గత రెండు నెలలుగా జిల్లా కేంద్రాల్లో సాగుతున్న ఈ శిక్షణకు హాజరైన వారి సంఖ్య కేవలం 10 నుంచి 20 శాతం లోపు మాత్రమే ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. శిక్షణ తరగతులు జరుగుతున్న సమయంలో కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తుంటే, క్షేత్రస్థాయిలో సర్పంచులు మాత్రం తమ వ్యక్తిగత పనుల్లో నిమగ్నమయ్యారు. విచిత్రమేమిటంటే, తరగతులకు హాజరుకాని వారు సైతం శిక్షణ పూర్తయ్యాక ఇచ్చే సర్టిఫికెట్లను మాత్రం పోటీపడి మరీ తీసుకోవడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### సర్టిఫికెట్లే ముఖ్యం..

పాలనాపరమైన మెళకువలు నేర్చుకోకుండా కేవలం సర్టిఫికెట్ల కోసం పాకులాడటం చూస్తుంటే, సర్పంచులకు గ్రామ అభివృద్ధిపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీల చట్టాలు, నిధుల వినియోగంపై అవగాహన లేకపోతే భవిష్యత్తులో పాలనలో అనేక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. శిక్షకులు ఎంతగా ప్రయత్నించినా సర్పంచులు హాజరుకాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

### పాలన సాగేదెలా? గ్రామస్తుల ఆగ్రహం..

కనీస శిక్షణకు కూడా హాజరుకాని సర్పంచులు తమ గ్రామాలను ఎలా అభివృద్ధి చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి శిక్షణ ఏర్పాటు చేస్తే దానిని సద్వినియోగం చేసుకోలేని వారు గ్రామపాలనను ఎలా గట్టెక్కిస్తారనే చర్చ మొదలైంది. నిధుల దుర్వినియోగం కాకుండా చూడాలన్నా, గ్రామానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నా కనీస పరిజ్ఞానం అవసరం. అలాంటిది శిక్షణకు గైర్హాజరైన వారు కేవలం రబ్బర్ స్టాంపుల్లా మారుతారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ఈ ఉదాసీనత ఇలాగే కొనసాగితే గ్రామీణ అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి శిక్షణకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని లేదా తిరిగి కఠినంగా శిక్షణ ఇచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
11-04-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 73
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## ఈ హాస్టల్ లో ఉండలేం బాబోయ్.?

- 120 మందికి ఒక్కటే పరిశుభ్రత లేని టాయిలెట్.
- పాచి పోయిన భోజనం నాణ్యతలేని వంట
- మొరపెట్టుకున్న పంట్టించుకోని ప్రిన్సిపాల్
- ప్రతి రోజు పాములతో బిక్కు బిక్కు మంటున్న పట్టించుకోరు.

6






## జర్నలిస్టులకు అక్రెడిటేషన్ తిప్పలు !

- హెల్ప్‌లైన్ నంబర్ స్విచ్ ఆఫ్.. ఫోన్ రింగ్ అయినా స్పందన కరువు
- సందిగ్ధంలో వందలాది మంది అప్లికేషన్లు
- ఎడిట్ ఆప్షన్ లేక కార్డులు ఆగిపోతాయన్న ఆందోళన
- తక్షణమే నంబర్ పనిచేసేలా చేయాలంటున్న జర్నలిస్టులు
- సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న మీడియా ప్రతినిధులు

**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్):** తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ జర్నలిస్టులకు

మిగతా 2వ పేజీలో..



## ఏఐ, పర్యవేక్షణతో పెరిగిన ఆదాయం

- త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యంగా ఆదాయం పెరగాలి
- ఆయా శాఖలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- రెవెన్యూ జనరేషన్ & రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం

2


# నిరసనల తెలంగాణ!

**90 రోజుల్లో మార్పంటూ హామీలు..**
**రెండున్నరేళ్లలో వైఫల్యాల మూటలు..**

- వర్గాలవారీగా రగులుతున్న ఆగ్రహం
- 20 వేల మంది ఆర్టీసియన్ల సమ్మెతో కమ్ముకోనున్న చీకట్లు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కోర్టు మెట్లెక్కిన పెన్షనర్లు
- ఉద్యోగుల అసహనం.. భగ్గుమంటున్న ప్రభుత్వ సిబ్బంది.
- రైతు భరోసా దగా.. చెప్పింది రూ.15 వేలు.. రూ.5 వేలకే పరిమితం
- పేదోడి ఇంటిపైనే హైడ్రా ప్రతాపం..
- ఆర్టీసీ సమ్మె సైరన్.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

4

ఈ నిరసనల పర్వంలో అన్నింటికంటే ప్రధానంగా కనిపిస్తున్నది విద్యుత్ రంగ సంక్షోభం. గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర చేస్తూ, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ శాఖలోని ఆర్టీసియన్లను (కాంట్రాక్ట్ ఉద్యోగులు) నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన క్రమబద్ధీకరణ సరికాదని విమర్శించిన నేతలు, నేడు గద్దెనెక్కాక తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం కార్మికులను ఆగ్రహానికి గురిచేస్తోంది. సుమారు 20 వేల కుటుంబాలు ఈ క్రమబద్ధీకరణపైనే ఆశలు పెట్టుకోగా, ఇప్పుడు ఆర్థిక భారమంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం గమనార్హం. గత మూడు రోజులుగా విద్యుత్ సౌధ వద్ద ఆర్టీసియన్లు చేస్తున్న సమ్మె రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టే ప్రమాదం కనిపిస్తోంది.



- సగం మందికి కూడా అందని రుణమాఫీ ఫలాలు
- జాబ్ క్యాలెండర్ జాడ లేక.. కరిగిపోతున్న యవ్వనం



## ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

- ఈ జనవరి నుండి 2.1% డీఏ పెరుగుదల
- ప్రకటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం

3

## తప్పుడు ఆరోపణలు మానుకోండి

- బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్
- అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ

**కొత్తగూడెం, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:** అంగన్‌వాడీలకు పంపిణీ చేసేందుకు కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్లలో అవకతవకలు అంటూ బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హితవు పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె

మిగతా 2వ పేజీలో..





### మీతో కలిసి పనిచేయమని
# దేవుడే పంపిండు

- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి భావోద్వేగం
- ఎర్రవెల్లిలో స్వాగతం పలికిన కేటీఆర్, ముఖ్య నేతలు
- కేసీఆర్‌తో జీవన్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ
- ఇష్టాగోష్ఠి అనంతరం లంచ్‌కు ఆహ్వానం

2



2

## ప్రతిపక్షాలది బురద రాజకీయం

వారి బురదను మాకు అంటించే యత్నం
రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి



2


## ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

- కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం

## చికిత్స కంటే నివారణే మేలు

- ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాం

3



## గుంపు మేస్త్రీ అంటూ..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, సిరి న్యూస్‌టుడే**

హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి

మిగతా 3వ పేజీలో..





3

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు..

కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ

## విద్యా రంగం బలోపేతానికి కేంద్రం కృషి

- కేంద్ర, రాష్ట్ర విభాగాలతో 'దిశ' సమావేశం
- పౌర సేవలపై సమీక్ష నిర్వహించాం
- మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, అలాగే స్మార్ట్ క్లాసులు, డిజిటల్ క్లాసులు వంటి సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లోని

మిగతా 3వ పేజీలో..



తెలంగాణకు రెండు కొత్త ప్రాజెక్టులు 3

## భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో మతం మార్పిడి దందా

- అన్నదమ్ముల ఘాతుకం వెలుగులోకి

**హైదరాబాద్, సిరి న్యూస్‌టుడే**

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ యువతులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఒక దారుణమైన వంచన ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో వల వేయడం, ఆపై మతం మార్చుకోవాలంటూ తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు

మిగతా 3వ పేజీలో..



# తప్పుడు ఆరోపణలు మానుకోండి

**మొదటిపేజీ తరువాయి**



మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కేంద్రం ఆధ్వర్యంలోని జెమ్ పోర్టల్‌లో అత్యంత పారదర్శకంగా టెండర్ ప్రక్రియ ద్వారా మొబైల్ ఫోన్ల కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. రెండుసార్లు టెండర్లు పిలిచామని, రూ.14,999లకు ఫోన్లు కొనుగోలు చేసినట్లు కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే టీజీ టీఎస్ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిందని చెప్పారు. రూ.11,800 గరిష్ఠ ధరకు మొబైల్ కొనుగోలు చేయాలని కేంద్రం మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ తాము అంతకన్నా తక్కువకే రూ.11,650కే కొనుగోలు చేశామని చెప్పారు. దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్న దుర్మార్గులను కేసీఆర్ అదుపులో పెట్టాలని, లేకపోతే మీకే నష్టం అని చెప్పారు. ఆడబిడ్డల మీద తప్పుడు ప్రచారం చేయడం దారుణమని, నిజంగా మీ వద్ద ఆధారాలుంటే కేంద్రానికి ఫిర్యాదు చేయండి.. కోర్టులకు వెళ్లండి అని సూచించారు. తప్పుడు ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. గతంలో ఇసుక తవ్వకాల విషయంలో టీఆరఎస్‌కు లీగల్ నోటీసులు ఇస్తే అప్పుడు విచారం వ్యక్తం చేశారు.. ఇప్పుడు కూడా తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే లీగల్ చర్యలు తప్పవు అని అన్నారు. అయిదేళ్ల కిందట అంగన్వాడీలకు రూ.10 వేలకు మీరు ఫోన్లు కొనుగోలు చేశారు.. ఇప్పుడు ధరలు పెరిగాయి.. అడ్వాన్స్‌డ్ మొబైల్స్.. నిజంగా తక్కువ ధరకే మొబైల్స్ వస్తే మీరెందుకు ఓపెన్ టెండర్లలో పాల్గొనలేదని ప్రశ్నించారు. టెండర్లలో పాల్గొనకుండా ఇప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గం అని అన్నారు. ఆడబిడ్డలకు అత్యాధునిక మొబైల్స్ ఇస్తే ఎందుకు నిప్పులు పోసుకుంటున్నారు అని మంత్రి సీతక్క నిలదీశారు.




# జర్నలిస్టులకు అక్రెడిటేషన్ తిప్పలు !

**మొదటిపేజీ తరువాయి**

చుక్కలు చూపుతోంది. దరఖాస్తు చేసుకునే సమయంలో ఏవైనా పొరపాట్లు దొర్లినా, లేదా డాక్యుమెంట్లు సరిగ్గా అప్‌లోడ్ కాకపోయినా వాటిని సరిచేసుకునేందుకు లేదా పాత దరఖాస్తును తొలగించి కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ఒక హెల్ప్‌లైన్ నంబర్‌ను (9154170881) కేటాయించింది. అయితే, క్షేత్రస్థాయిలో ఈ నంబర్ కేవలం అలంకారప్రాయంగానే మిగిలిపోయింది. గత కొన్ని రోజులుగా వందలాది మంది జర్నలిస్టులు తమ అప్లికేషన్లలోని చిన్నపాటి తప్పులను సరిదిద్దుకోవడానికి ఈ నంబర్‌కు ప్రయత్నిస్తుండగా, అది నిరంతరం స్విచ్ ఆఫ్ అని వస్తోంది. ఒకవేళ పొరపాటున ఫోన్ రింగ్ అయినా, అవతలి వైపు నుంచి అధికారులు గానీ, సిబ్బంది గానీ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని కోరుకునే జర్నలిస్టులకు, శాఖాపరమైన ఈ నిర్లక్ష్యం శాపంగా మారింది.

**ఆందోళనలో వందలాది మంది జర్నలిస్టులు...**

పోర్టల్‌లో నేరుగా దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, పూర్తిగా హెల్ప్‌లైన్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. కానీ ఇచ్చిన నంబర్ పని చేయకపోవడంతో తప్పుగా ఉన్న సమాచారంతోనే కార్డులు రిజెక్ట్ అవుతాయేమోనని జిల్లాలు, మండల స్థాయి జర్నలిస్టులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యలు చెప్పుకుందామన్నా సమాధానం ఇచ్చే నాథుడే కరువయ్యారని వారు మండిపడుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన హెల్ప్‌లైన్ నంబర్ వెంటనే పనిచేసేలా చూడాలని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించాలని మీడియా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమాచార శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రక్రియను సరళతరం చేయకపోతే, వందలాది మంది అర్హులైన జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపిండు

- **మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి భావోద్వేగం**
- **ఎర్రవెల్లిలో స్వాగతం పలికిన కేటీఆర్, ముఖ్య నేతలు**
- **కేసీఆర్‌తో జీవన్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ**
- **ఇష్టాగోష్ఠి అనంతరం లంచ్‌కు ఆహ్వానం**

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఎర్రవెల్లిలోని బీఆరఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసానికి శుక్రవారం చేరుకోగా ఆయనకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛాలందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డాక్టర్ కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు అక్కడ ఉన్నారు. జీవన్ రెడ్డితోపాటు వచ్చిన వారిలో ఆయన కుమారులు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత సురేశ్ దంపతులు తదితరులున్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అన్నా.. నన్ను మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపిండు అని భావోద్వేగానికి గురయ్యారు. నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, తెలంగాణ సాధకుడు, రైతు బాంధవుడు కేసీఆర్ కలయిక సందర్భంగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీ దగ్గరికి పంపించిండు.. అన్నా అని అన్నారు. చాలాకాలం తర్వాత మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. కాగా, జీవన్ రెడ్డిగారిని అనునయిస్తూ ఆయనను అప్యాయంగా దగ్గరికు తీసుకున్న కేసీఆర్ హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకొని దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కొద్దిసేపు ఇరువురూ ఇష్టాగోష్ఠి జరుపుకున్న తర్వాత జీవన్ రెడ్డి బృందాన్ని కేసీఆర్ లంచ్‌కు ఆహ్వానించారు.



# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట భారీ మోసం..

# రూ.5 కోట్లు బురిడీ..

- **ఉద్యోగాల పేరుతో కోట్ల మోసం**
- **452 మంది నుంచి భారీ వసూళ్లు**
- **నకిలీ కంపెనీలతో మళ్లీ మోసం ప్రయత్నం**
- **ముగ్గురు అరెస్ట్.. మరికొందరు పరార్**

**హైదరాబాద్, సిరి న్యూస్‌టుడే**




సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనే నిరుద్యోగుల ఆశను పెట్టుబడిగా మార్చుకున్న ఒక కేటుగాళ్ల ముఠా మాదాపూర్ కేంద్రంగా భారీ మోసానికి తెరలేపింది. 'Camel Q సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్' అనే సంస్థ పేరుతో రంగంలోకి దిగిన ఈ ముఠా, సుమారు 452 మంది అభ్యర్థుల నుంచి దాదాపు రూ. 5 కోట్ల వరకు వసూలు చేసింది. మాదాపూర్ పోలీసులు పక్కా నిఘా పెట్టి ఈ ముఠా గుట్టును రట్టు చేశారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న ఈ పది మంది సభ్యుల ముఠా, నిరుద్యోగులకు గాలం వేసింది. శిక్షణ , ప్లేస్‌మెంట్స్ ఇప్పిస్తామని నమ్మించి, ఒక్కొక్క అభ్యర్థి నుంచి వారి అవసరాన్ని బట్టి రూ. 80 వేల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారు. అభ్యర్థులకు నమ్మకం కలిగించడం కోసం ప్రారంభంలో కొందరికి జీతాలు కూడా చెల్లించారు. ఆ తర్వాత అకస్మాత్తుగా బోర్డు తిప్పేసి పరారయ్యేవారు.

ఒక సంస్థపై నిఘా పెరుగుతోందని గమనించిన ఈ ముఠా, ఇటీవల 'MU సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్' అనే మరో కొత్త పేరుతో సంస్థను ప్రారంభించి మళ్లీ మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నించింది. అయితే, బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు ఎరుకల మహేష్ (32) తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ముఠాలో ఉన్న మరో ఏడుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠాపై గతంలోనే మాదాపూర్ , KPHB పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి ఒక కారు, స్కూటీ, మొబైల్ ఫోన్లు, కంపెనీ స్టాంపులు , బ్యాంక్ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు తరలించారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కంపెనీల పూర్వాపరాలను పరిశీలించకుండా భారీ మొత్తంలో డబ్బులు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు.

# మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు..

- **రూ.2 లక్షల లోపు పంట రుణమాఫీ.. 25 లక్షల మంది రైతులకు లబ్ధి..**

**హైదరాబాద్, ఏప్రిల్10, సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే చారిత్రాత్మకమైన రూ. 2 లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ భారీ రుణమాఫీతో దేశంలోనే రైతు పక్షపాత ప్రభుత్వంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఒకేసారి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన దాఖలాలు లేవని, ఆ ఘనత కేవలం మన ప్రభుత్వానికే దక్కుతుందని తుమ్మల పేర్కొన్నారు.

ఇప్పటివరకు ప్రభుత్వం రూ. 20,616 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలు రుణ విముక్తి పొందాయని ఆయన వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల సకాలంలో రుణమాఫీ జరగక, సామాన్య రైతుపై వడ్డీ భారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోయారని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు కేవలం వారి రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప, రైతు ప్రయోజనాల కోసం కాదని ఆయన మండిపడ్డారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు విముక్తి కల్పించామని తుమ్మల తెలిపారు. కేవలం రుణమాఫీతోనే ఆగిపోకుండా, రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి .. నాణ్యమైన విత్తనాల సరఫరా వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు.

# ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

- **కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం**

**ముంబై, ఏప్రిల్10, సిరి న్యూస్‌టుడే:**



ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 29 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. కెన్యాలోని నైరోబీ నుంచి ఈ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ముంబై విమానాశ్రయం లో భారీ ఎత్తున బంగారాన్ని అక్రమంగా తీసుకొస్తున్నారని డీఆర్ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమై ఆపరేషన్ ధహబు పేరుతో విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా బంగారం బయటపడింది. మహిళలు దుస్తులు, బ్యాగుల్లో సుమారు 29 కిలోల బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. బంగారాన్ని సీజ్ చేసిన అధికారులు 26మంది కెన్యా దేశస్థులను అరెస్ట్ చేశారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్ దాటిన తర్వాత అధికారులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ప్రతిపక్షాలది బురద రాజకీయం

- **వారి బురదను మాకు అంటించే యత్నం**
- **రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**

**ఖమ్మం/హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**

ప్రతిపక్షానికి చెందిన కొంతమంది తమకు అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని, ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తులో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో రూ.1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజును చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ.20,670 కోట్ల మేర రుణ మాఫీ చేసి చరిత్ర సృష్టించామని, ఏడాదికి ఎకరానికి రూ.12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలు అందజేశామన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందులు పడ్డారని, దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో మంత్రి పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఏఐ, పర్యవేక్షణతో పెరిగిన ఆదాయం

- **త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యంగా ఆదాయం పెరగాలి**
- **ఆయా శాఖలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం**
- **రెవెన్యూ జనరేషన్ & రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**



ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగం, వివిధ శాఖల్లో పన్నుల ద్వారా వస్తున్న ఆదాయంపై నిరంతరం సమీక్ష, పకడ్బందీ నిర్వహణతో వివిధ శాఖల్లో ఆదాయం పెరుగుదల కనిపిస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో సభ్యులు మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఏఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణా శాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామని డిప్యూటీ సీఎం తెలిపారు. అధికారులు మరింత పకడ్బందీగా పనిచేసి ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్ లోడ్ వంటి వాటిపై పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిరంతరం సమీక్షలు, పన్నుల నిర్వహణలో పకడ్బందీ చర్యల మూలంగా వాణిజ్య పన్నుల శాఖలో జీఎస్టీ దాయం గత మూడు నెలలుగా 15% పెరుగుదల కనిపించిందన్నారు. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ శాఖలో సైతం ఆదాయంలో పెరుగుదల కనిపించిందని తెలిపారు. ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రతి శుక్రవారం రెవెన్యూ జనరేషన్ అండ్ రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. 2047వరకు త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్న మేరకు అన్ని శాఖలు ఆదాయ సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల విక్రయానికి సంబంధించి ప్రపంచస్థాయిలో ప్రచారం నిర్వహించాలని, ఈ అంశంపై అందరికీ ముందస్తుగా సమాచారం అందడం మూలంగా ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంటుందని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. భూముల విలువ పెంపునకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేసి అధ్యయనం పూర్తి చేశారు. ఆ కమిటీల నివేదికలను ముందుగా సబ్ కమిటీకి సమర్పించి ఆ తర్వాత కేబినెట్‌కు నివేదించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను భట్టి ఆదేశించారు. మెట్రో రైల్ స్వాధీనం, నిర్వహణ, ఆదాయ, వ్యయ మార్గాలపై అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఎక్సైజ్, రెవెన్యూ, పరిశ్రమల శాఖలోనూ ఆదాయం పెంపునకు సంబంధించి చేపట్టిన చర్యలు, ఫలితాలపై మంత్రులు సమీక్ష చేశారు. ప్రతి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వాటి ఫలితాలకు సంబంధించిన చర్యల నివేదికతో తదుపరి సమావేశాలకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, శ్రీధర్, శశాంక పాల్గొన్నారు.

# తెలంగాణకు రెండు కొత్త ప్రాజెక్టులు


- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం**

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పదకొండేళ్లుగా తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటునందిస్తోందని, ముఖ్యంగా రోడ్డు రవాణా, రైల్వే ప్రాజెక్టుల విషయంలో ప్రాధాన్యత ఇస్తూ కేటాయింపులు చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తాజాగా సేతు బంధన్ పథకం కింద రూ.103 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ ఆమోదం తెలపడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణకు ప్రాజెక్టులు కేటాయించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'సేతు బంధన్'లో భాగంగా సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆరఎఫ్) కింద రూ.103 కోట్ల పనులకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ ఆమోదం తెలిపింది. నల్గొండ జిల్లా పరిధిలో నార్కట్ పల్లి మునుగోడు రైల్వే లైన్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.69 కోట్లు, ఖమ్మం జిల్లా మధిరలోని రైల్వే లైన్ దగ్గర అండర్ పాస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జితోపాటు అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి కేంద్రం రూ.34 కోట్లు ఖర్చు చేయనుందని వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని, రవాణా మెరుగుపడటంతోపాటు రైల్వే ప్రమాదాలు తగ్గుముఖం పట్టనున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు.

# భాగ్యనగరంలో 'ప్రేమ' ముసుగులో మతం మార్పిడి దందా

**మొదటిపేజీ తరువాయి**



అన్నదమ్ముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జమీర్, అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో అమాయక యువతులను ట్రాప్ చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ అన్నదమ్ములు ఇద్దరూ ఇప్పటివరకు సుమారు ఐదుగురు హిందూ యువతులను ప్రేమ పేరుతో నమ్మించి, వారి జీవితాలతో ఆడుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

నిందితుల్లో ఒకరైన జమీర్‌పై గతంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదై ఉండటం గమనార్హం. ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా, అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పోలీసులు గుర్తించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత జమీర్ తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ అరాచకాలను మరింత ముమ్మరం చేశాడు. తాజాగా మరో యువతిని తన ప్రేమ వలలో వేసుకున్న జమీర్, ఆమెను లొంగదీసుకున్న తర్వాత అసలు స్వరూపాన్ని బయటపెట్టాడు. సదరు యువతిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆమెను తమ మతంలోకి మారాలని బలవంతం చేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాడు. ఒకవేళ ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలు తీస్తామంటూ అన్నదమ్ములిద్దరూ కలిసి బాధితురాలిని బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు సమాచారం. బాధితురాలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ అన్నదమ్ముల గుట్టు రట్టయింది. రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ అన్నదమ్ములు కేవలం ఇద్దరే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారా లేక వీరి వెనుక ఏదైనా పెద్ద ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, నిందితుల నుంచి ప్రాణహాని ఉన్న యువతులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఇటువంటి దాడులు స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.



# ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

- **ఈ జనవరి నుండి 2.1% డీఏ పెరుగుదల**
- **ప్రకటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం**

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికి సంబంధించిన ఏకైక పెండింగ్ డీఏను ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి 2026 నుండి 2.1 శాతం పెరిగిన డీఏ అమలులోకి వచ్చింది. దీంతో సవరించిన డీఏ వల్ల 52.8 శాతానికి చేరింది. జనవరి నుండి ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు వచ్చే మూడు నెలలకుగాను ఒక్కో నెలలో విడుదల చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆర్ఎంలతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో మొదటి నుండి ఆర్టీసి సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌల్యభం కేంద్రంగా పనిచేస్తున్నదన్నారు. సంస్థకు ప్రధానంగా కార్మికుల సంక్షేమంపై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణకు హాస్పిటల్ అభివృద్ధి, కారుణ్య నియామకాలు, దీర్ఘకాలంగా తొలగింపునకు గురైన వారిని త్రీమెన్ కమిటీ ద్వారా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడం, కొత్త నియామకాలు చేపట్టి పని భారం తగ్గించడం, కొత్త బస్సులు కొనుగోలు వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నదని ఆయన వివరించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ 2.1 శాతం పెంచడం వల్ల గతంలో ఉన్న 50.7 శాతం నుండి 52.8 శాతానికి పెరిగిందన్నారు. చివరగా జూలై 2025లో 2.1% డీఏను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. జూలై 2025లో 48.6% నుండి 50.7%కి పెరగగా ప్రస్తుతం పెరిగిన 2.1 శాతం డీఏతో 52.8%కి చేరింది. మే 2024లో ఆర్‌పీఎస్2017 అమలు తరువాత ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు లేవు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డిలు ఆర్టీసీ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. డీఏ ప్రకటించడం పట్ల మంత్రి పొన్నంను ఎండీ, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఆర్టీసీ ఉద్యోగికీ ఇది వర్తిస్తుందని, లైఫ్ లైన్‌గా ఉన్న ఆర్టీసీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లలా కృషి చేయాలని మంత్రి సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయని ఎండీ నాగిరెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఈడీలు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాల్మన్, ఎఫఏ విజయపుష్ప, సీడీఎం శ్రీధర్, సీపీఎం ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగం బలోపేతానికి కేంద్రం కృషి

**మొదటిపేజీ తరువాయి**

డాక్టర్ ఎంసీఆర్ హెచఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశంలో హైదరాబాద్‌లో ఉన్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అన్ని శాఖలు ప్రజలకు అందిస్తున్న పౌరసేవలపై సమీక్ష నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్యం, జీవన ప్రమాణాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సరఫరా వంటి అనేక అంశాలపై జరుగుతున్న పనులను సమీక్షించామన్నారు. ఈ సమావేశం చాలా ఉపయోగకరంగా జరిగిందన్నారు. వైద్య రంగం బలోపేతం కోసం చర్యలు తీసుకుంటున్నామని, హైదరాబాద్‌లోని హాస్పిటల్స్‌లో డయాలిసిస్ సెంటర్లు, వ్యాక్సినేషన్ సదుపాయాలు, ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, ఇవన్నీ సమర్థంగా అమలు అవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతరం పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. వచ్చే మూడు నెలల కార్యాచరణపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించామన్నారు. హైదరాబాద్ ఒక స్టేట్ కేపిటల్‌గా, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం అని, దీనికి అవసరమైన తాగునీటి సమస్యల పరిష్కారం, రోడ్డు కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మహిళా సంక్షేమం వంటి అన్ని అంశాలపై దృష్టిసారిస్తున్నామని, అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రతి సమస్యపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొంటున్నామని వివరించారు. వేసవి నేపథ్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, జీహెచఎంసీ, మెట్రో వాటర్, విద్యా శాఖలు కలిసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని, పిల్లలకు పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని విద్యా శాఖకు సూచించామన్నారు. అదేవిధంగా వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లపై కూడా దృష్టి పెట్టామని, డ్రైనేజీ సిస్టమ్, పైప్‌లైన్స్, ఓపెన్ నాలాలు, వరద నీటి ప్రవాహ మార్గాలు వంటి వాటిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అన్ని మాన్యువల్స్, వ్యవస్థలను చెక్ చేయాలని సూచించామన్నారు. రవాణా శాఖతో కలిసి హైదరాబాద్‌లో కొత్త ఆడిటోరియం నిర్మాణంపై కూడా చర్చించామని, ఆ ప్రదేశాన్ని శనివారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి తెలిపారు. నగర అభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నామన్నారు. హైదరాబాద్ ఒక సైంటిఫిక్ ఎడ్యుకేషన్, రీసెర్చ్, ఐటీ హబ్‌గా ఉందని, ఇది మరింతగా పరిశోధనలో అభివృద్ధి చెందాల్సి ఉన్నందున నేషనల్ సైన్స్ సెంటర్‌ను కూడా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంతేకాక ఇక్కడ అనేక రకాల టూరిజం అవకాశాలు ఉన్నందున టూరిజం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, అనేక కొత్త ఇన్‌స్టిట్యూషన్స్‌ను కూడా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించి, సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ద్వారా హైదరాబాద్ నగర అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు తీసుకొస్తున్నామని, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణే నగరాలకు హై స్పీడ్ రైలు, ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని కూడా వివరించారు. ఇవి తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హై స్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని అభివృద్ధి చెందడం తెలంగాణకు, ముఖ్యంగా హైదరాబాద్‌కు లభించిన గొప్ప గుర్తింపు అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రకారం ప్రతిపాదనలు పంపిస్తే వాటిని కేంద్రం ఆమోదిస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించగలమని అన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, మెట్రో వాటర్ బోర్డు అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ, ఐఐటీ మధ్య ఎంవోయూ**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి సమక్షంలో ఐఐటీ హైదరాబాద్, ములుగు జిల్లాలోని సమ్మక్కసారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఎసఎస్‌సీటీయూ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి. ఎసఎస్‌సీటీయూ వీసీ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త పాఠ్య ప్రణాళికలను రూపొందించనున్నారు. అలాగే అధ్యాపకులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించి సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించనున్నారు. ఎసఎస్‌సీటీయూలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రయోగశాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్, నిపుణుల ఉపన్యాసాలు నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాలను మెరుగుపరచనున్నారు. అదనంగా, ఎసఎస్‌సీటీయూ అధ్యాపకులకు ఐఐటీ హైదరాబాద్ ప్రత్యేక శిక్షణ అందించనుంది. బోధనలో మెళకువలు పెంపొందించేందుకు కార్యశాలలు, సెమినార్లు, అతిథి ఉపన్యాసాలను నిర్వహిస్తారు. 202627 విద్యాసంవత్సరం నుంచి సాంకేతిక కోర్సుల నిర్వహణకు ఐఐటీ హైదరాబాద్ సహకారం అందిస్తుంది. ఈ క్రమంలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో బీటెక్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్‌లో బీఎస్, కంప్యూటర్ సైన్స్ అండ్ డేటా అనలిటిక్స్ బీఎస్ వంటి కోర్సులు ప్రారంభించనున్నారు. ఈ కోర్సులను బోధించే అధ్యాపకులకు శిక్షణ బాధ్యతను ఐఐటీ హైదరాబాద్ చేపడుతుంది. ఐఐటీ హైదరాబాద్ మార్గదర్శకత్వంలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు, ముఖ్యంగా తెలంగాణ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. మారుమూల ప్రాంతంలో ఉన్న ఈ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందుతూ ప్రాంతీయ విద్యాభివృద్ధికి దోహదం చేయనుంది.



# గుంపు మేస్త్రీ అంటూ..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

**మొదటిపేజీ తరువాయి**



జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తుచేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు.

ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు..

**హైదరాబాద్, సిరి న్యూస్‌టుడే**

తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి ఈరోజు జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు వంటి కీలక నేతలు ఉండటం విశేషం.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు.

లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# చికిత్స కంటే నివారణే మేలు

- **ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాం**
- **ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలు**
- **యోగా సెషన్స్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 10, సిరి న్యూస్‌టుడే:**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా.. చికిత్స కన్నా నివారణే మేలు అనే థీమ్‌తో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా సెషన్స్‌ను గచ్చిబౌలి స్టేడియం నుంచి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి యోగా చేశారు. అనంతరం ఆయుష్ విభాగం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు. యోగ కార్యక్రమంలో మంత్రి దామోదర్ మాట్లాడుతూ ఈ రోజు వరల్డ్ హోమియోపతి డే సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, చికిత్సకంటే నివారణే మేలు అనే లక్ష్యంతో ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భారత దేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరం యోగ అని చెప్పుకోవాలి.. ఇది కేవలం వ్యాయామం కాదు.. సంపూర్ణ జీవన విధానం.. యోగ సాధన ద్వారా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యత సాధ్యమవుతుంది అని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న, వేగవంతమైన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం కారణంగా షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి నాన్‌కమ్యూనికబుల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు మానసిక ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత పెరుగుతుందని చెప్పారు. నిత్యం యోగా సాధనతో ఎన్‌సీడీల బారినపడకుండా ఉంటారన్నారు.

**చికిత్సతోపాటు రోగ నివారణకు సమాన ప్రాధాన్యత**

ప్రభుత్వం చికిత్సతోపాటు రోగ నివారణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ఉచితంగా రక్తపోటు, షుగర్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్నామని, 46 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు సుమారు 30 రకాల పరీక్షలతో కూడిన సమగ్ర ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నామని, వివరించారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం బాలికలకు హెచ్‌పీవీ టీకా పంపిణీ చేస్తున్నామని, ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి హెల్త్ కార్డులను అందించే దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. కల్తీ, నాసిరకం ఆహారంపై కఠిన చర్యలు తీసుకుంటూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు 145 పాలీక్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, బాల భరోసా కార్యక్రమం ద్వారా అయిదేళ్ల లోపు పిల్లలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించి శారీరక, మానసిక లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ఆరోగ్య సేవలను హాస్పిటల్స్ నుంచి నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నామన్నారు. యోగ, నేచురోపతి, హోమియోపతి వంటి ఆయుష్ విధానాలను బలోపేతం చేసి ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 750 మంది యోగ శిక్షకులను నియమించి రోజువారీ యోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాల ద్వారా ఇప్పటికే దాదాపు పది లక్షల మందికి యోగను పరిచయం చేయగలిగామని అన్నారు. యోగ విద్యను ప్రోత్సహించేందుకు బీఎన్‌వైఎస్ కోర్సుతోపాటు పీజీ కోర్సులను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యంగా ఉండడం ఆప్షన్ కాదు.. ఆవశ్యకం అనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. మనం ఎంత ధనవంతులమైనా ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథానే అన్నారు. పతి ఒక్కరూ యోగా.. లేదా మరేదైనా శారీరక వ్యాయామాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని మంత్రి దామోదర్ సూచించారు. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది.. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణం కోసం మనమంతా కలిసి ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, వెయ్యిమందికి పైగా విద్యార్థులు, యువత, యోగా బోధకులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా గురుపాదుక పూజా మహోత్సవం

- రంగంపేల ఆశ్రమ పీఠాధిపతి మాధవనంద సరస్వతి పూజలు
- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, చిట్టిబాబు ముదిరాజ్



**జోగిపేట, ఏప్రిల్ 10, (సిరిన్యూస్):**

జోగిపేట పట్టణంలోని శ్రీ సిద్ధివినాయక టౌన్‌షిప్‌లో రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవనంద సరస్వతి గురుపాదుక పూజా మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రాహ్మణులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. టౌన్‌షిప్‌లో ఉన్న హనుమాన్ విగ్రహానికి మాధవ నంద సరస్వతి స్వామి పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని వారికి సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, కాసాల ప్రవీణ్‌కుమార్ దంపతులు  పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ జి.మల్లయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్యలతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అంగన్వాడి కేంద్రాల్లో పోశణ పక్వాడ పక్షోత్సవం

### తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

**వెల్దుర్తి, ఏప్రిల్ 10,( సిరి న్యూస్ ):**



వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి టీచర్లు ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన పోషణ్ పక్వాడ పక్షోత్సవం శుక్రవారం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే గర్భిణీలు పాలిచ్చే తల్లులకు ప్రత్యేకంగా జీరో నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు పోషకాహారం ఎదిగే పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహార అందించాలని సూచించారు. జింకు ఫుడ్డు పూర్తిగా మానేయాలని అన్నారు. ఆకుకూరలు సీజన్లో దొరికే పండ్లు ఆకుపచ్చగా పసుపు పచ్చగా ఉండే ఆకు కూరగాయలను ఎక్కువగా పిల్లలకు ఇవ్వాలని సూచించారు. పిల్లల ఎదుగుదలలో సమస్యలు ఉన్నట్లయితే సరైన ఎత్తుకు తగిన బరువు వయసుకు తగిన ఎత్తు లో ఏమైనా లోపాలుంటే ప్రతినెల అంగన్వాడి కేంద్రంలో బరువు ఎత్తులు తీసి తక్కువ బరువుతో ఉంటే వారికి బాలామృతం ప్లస్ ఇవ్వటం జరుగుతుందని సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి పోషణ పక్వాడ సమాచారం అందించే విధంగా కృషి చేస్తామన్నారు.పోషణ్ బి లాంటివి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు, ఏఎన్ఎం, ఆశ,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల విరాళాలతో నిర్మించింది జోగిపేట కళాశాల

### జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్ .కృష్ణారెడ్డి

### జోగిపేట డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



**అందోలు, ఏప్రిల్ 10, (సిరిన్యూస్ ):**

జోగిపేట కళాశాలకు పెద్ద చరిత్ర ఉందని, రైతుల విరాళాలతో కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. జోగిపేటలోని నెహ్రు మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి బహుమతులను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.పి .రమేష్ సార్ అధ్యక్షతన 2 వార్షిక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, మున్సిపల్ ఏ.రవీందర్‌లు హజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి వార్డ్ కౌన్సిలర్ జి.అరుణ్ కుమార్ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్.సిహెచ్. శ్రీకాంత్ . స్పోర్ట్స్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. జి.పండరి, అధ్యాపకురాలు ఆర్ స్వర్ణలత, ఎం.సంధ్యాతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'నిరసనల' తెలంగాణ!

## 90 రోజుల్లో మార్చుతామంటూ హామీలు రెండున్నరేళ్లలో వైఫల్యాల మూటలు..

- వర్గాలవారీగా రగులుతున్న ఆగ్రహం
- 20 వేల మంది ఆర్టీసియన్ల సమ్మెతో కమ్ముకోనున్న చీకట్లు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కోర్టు మెట్లెక్కిన పెన్షనర్లు
- ఉద్యోగుల అసహనం.. భగ్గుమంటున్న ప్రభుత్వ సిబ్బంది.
- రైతు భరోసా దగా.. చెప్పింది రూ.15 వేలు.. రూ.5 వేలకే పరిమితం
- పేదోడి ఇంటిపైనే హైడ్రా ప్రతాపం..
- ఆర్టీసీ సమ్మె సైరన్.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- సగం మందికి కూడా అందని రుణమాఫీ ఫలాలు
- జాబ్ క్యాలెండర్ జాడ లేక.. కరిగిపోతున్న యవ్వనం
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల నిరసనలు



**హైదరాబాద్, సిరి న్యూస్ (ప్రత్యేక ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం నిరసనలకు నిలయంగా మారింది. ఎన్నికల వేళ జనానికి ఇచ్చిన అలవిగాని హామీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. అధికారం దక్కించుకున్న తొలినాళ్లలో ఉన్న ఉత్సాహం, అమలులో విఫలమవ్వడంతో ప్రజల్లో అసహనంగా మారుతోంది. కేవలం 90 రోజుల్లోనే అన్ని మార్చేస్తామన్న సర్కారు, రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలను పరిష్కరించలేకపోవడంతో ప్రతి వర్గం నేడు రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను గళమెత్తుతోంది.

### చీకటి ముంగిట విద్యుత్ రంగం

ఈ నిరసనల పర్వంలో అన్నింటికంటే ప్రధానంగా కనిపిస్తున్నది విద్యుత్ రంగ సంక్షోభం. గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర చేస్తూ, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ శాఖలోని ఆర్టిసియన్లను (కాంట్రాక్ట్ ఉద్యోగులు) నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన క్రమబద్ధీకరణ సరికాదని విమర్శించిన నేతలు, నేడు గద్దెనెక్కాక తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం కార్మికులను ఆగ్రహానికి గురిచేస్తోంది. సుమారు 20 వేల కుటుంబాలు ఈ క్రమబద్ధీకరణపైనే ఆశలు పెట్టుకోగా, ఇప్పుడు ఆర్థిక భారమంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం గమనార్హం. గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిసియన్లు చేస్తున్న సమ్మె రాష్ట్రాన్ని చీకట్లోకి నెట్టే ప్రమాదం కనిపిస్తోంది. కార్మిక శాఖ ద్వారా జరగాల్సిన చర్చలు వాయిదా పడటం, మరోవైపు సమ్మె చేస్తే ఎస్మా విధిస్తామంటూ ప్రభుత్వం బెదిరింపులకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. 2017 ఒప్పందం ప్రకారం రావాల్సిన గ్రేడ్ ప్రమోషన్లు, వేతన పెంపుదల వంటి కనీస డిమాండ్లను కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యుత్ కార్మికులు వెనక్కి తగ్గేది లేదని భీష్మించుక కూర్చున్నారు.

### రిటైర్డ్ ఉద్యోగుల వేదన..

ఉద్యోగుల సమస్యలు కేవలం సర్వీసులో ఉన్నవారితోనే ఆగలేదు. జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించి, విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకున్న పెన్షనర్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. 2023లో రిటైర్మెంట్ వయస్సు పెంచడం వల్ల ఒకేసారి 3,656 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. అయితే, వీరికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడంలో ఆర్థిక శాఖ ఘోరంగా విఫలమైంది. చివరకు న్యాయం కోసం వారు హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ రాజేశ్వర్ రావు నేతృత్వంలోని ధర్మాసనం మార్చి 23న తక్షణమే చెల్లించాలని తీర్పునిచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో, కోర్టు మొట్టికాయలు వేసిన తర్వాతే 934 మందికి సుమారు రూ.50 కోట్లు చెల్లించింది. మిగిలిన 2,600 మంది పెన్షనర్లు నేటికీ తమ సొంత డబ్బు కోసం విడతల వారీ జాబితాలో వేచి చూడటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

### డీఏల పెండింగ్.. అందని ద్రాక్షగా అలవెన్సు..

ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం చెల్లింపుల విషయంలోనూ సర్కారు వింత పోకడలు అనుసరిస్తోంది. బకాయిలను ఏకంగా 30 విడతల్లో ఇస్తామన్న ప్రతిపాదన ఉద్యోగులకు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. దీనివల్ల పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వచ్చే సాయం ఏ మూలకు సరిపోవడం లేదని వారు వాపోతున్నారు. అంతేకాకుండా, ఈపీఎఫ్, జీపీఎఫ్ లోన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం, కొన్ని శాఖల్లో ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సులు కోట్ల రూపాయలు బాకీ పడటంతో ఉద్యోగ వర్గాల్లో ప్రభుత్వంపై నమ్మకం సడలి పోతోంది.

### రైతు భరోసా.. ఆశలు అడియాశలు

రైతాంగం పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎన్నికల ప్రచారంలో ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని, మూడు పర్యాయాలు ఇస్తామని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చారు. ఇప్పటికే రెండు సీజన్లు గడిచినా పూర్తిస్థాయిలో రైతు భరోసా అందలేదు. రుణమాఫీ ప్రక్రియలో ఉన్న గందరగోళం, సన్న వడ్లకు ఇస్తామన్న రూ.500 బోనస్ ఒక సీజన్‌కే పరిమితం కావడం రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి. ఈ సీజన్‌కు బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు కేటాయించినా, సాగు అయిపోయి కోతలు మొదలయ్యే వరకు ఊరించి, చివరికి ఒక ఎకరానికి మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకోవడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరు కల్లా అందరికీ ఇస్తామన్న మాటలు నీటిపై రాతలుగానే మిగిలి పోయాయి.

### నోటిఫికేషన్ల వేటలో నలిగిపోతున్న యువత

తెలంగాణ వస్తే కొలువులు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగులకు నేడు నిరాశే ఎదురవుతోంది. ఎన్నికల సమయంలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు కాకపోవడం, గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో తలెత్తుతున్న గందరగోళం నిరుద్యోగ యువతను మానసిక వేదనకు గురిచేస్తోంది. ప్రభుత్వం మారితే మా బతుకులు మారుతాయి అని నమ్మి ఓటేసిన అభ్యర్థులు, నేడు వయోపరిమితి దాటిపోతుంటే ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నిరుద్యోగ భృతి హామీ అటకెక్కింది, కొత్త నోటిఫికేషన్ల ఊసే లేదు. కేవలం కాంట్రాక్ట్ నియామకాలతో కాలం వెళ్లదీస్తూ, శాశ్వత ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం విస్మరించడంపై గాంధీ భవన్, ప్రగతి భవన్ ముట్టడికి యువత సిద్ధమవుతోంది. లైబ్రరీల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూ, కోచింగ్ సెంటర్ల ఫీజులు కట్టలేక వేలాది మంది యువకులు నేడు నిరసన గళం విప్పుతున్నారు.

### పేదోడి గూడుపైనే ప్రతాపమా?

హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా పేదల పాలిట శాపంగా మారింది. చెరువుల ఆక్రమణల తొలగింపు స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, బడా బాబుల ఫామ్‌హౌస్‌లు, కట్టడాలను వదిలేసి కేవలం మూసీ పరివాహక ప్రాంతంలోని పేదల ఇళ్లను, ఖమ్మం వంటి జిల్లాల్లో నిరుపేదల గూడులను కూల్చివేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నిర్మాణం వదిలి కూల్చివేతలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది అనే భావన సామాన్య ప్రజల్లో బలపడుతోంది.

### ఆర్టీసీలో సమ్మె సైరన్..

విద్యుత్ కార్మికులకు తోడుగా ఇప్పుడు ఆర్టీసీ కార్మికులు కూడా సమ్మె బాట పట్టారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న ఎన్నికల హామీ అమలు కోసం వారు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 8న చర్చలకు యాజమాన్యం గైర్హాజరు కావడంతో, ఆగ్రహించిన యూనియన్లు ఈ నెల 23 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని ప్రకటించాయి. 30 వేల మందికి పైగా ఉన్న కార్మికులు రోడ్డెక్కితే రాష్ట్ర రవాణా వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం ఉంది.

# ఘనంగా కేఎస్ పిపి 4వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా అమితాబ్ కాంత్
- 35 మందికి పట్టాలు ప్రదానం




**రామచంద్రపురం, ఏప్రిల్ 10 (సిరి న్యూస్):**

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ పరిధిలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (KSPP) నాలుగో స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నీతి ఆయోగ్ మాజీ సీఈవో, భారత జీ–20 షెర్పా అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమితాబ్ కాంత్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ప్రజా విధానాల ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు.



యువత సమర్థవంతమైన ప్రజా పరిపాలనకు దోహదపడాలని, ఆ విష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకతతో కూడిన విధానాల రూపకల్పనలో ముందుండాలని సూచించారు. భారత్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర కీలకమని ఆయన తెలిపారు.ఈ స్నాతకోత్సవంలో మొత్తం 35 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. మాస్టర్స్ ఇన్ పబ్లిక్ పాలసీ ప్రోగ్రామ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలు అందించారు.గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, ఉపకులపతి ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్, కేఎస్‌పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, డాక్టర్ వసుధా కద్దు వందన సమర్పణ చేశారు. కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం.!

- పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.
- క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ప్రశాంత జీవన శైలి తథ్యం.
- మానవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాతోనే సాధ్యం.
- ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా యోగా కార్యక్రమం.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ ఏప్రిల్, 10(సిరిన్యూస్)**

పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని,మానవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా.యోగా ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ముఖ్యఅతిథిగా హాజరైనారు.అదనపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ శివ దయాల్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, డీఎస్పీ ప్రసన్నకుమార్ , జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి వశిష్ట యోగా కేంద్రం ప్రసిద్ధ యోగా గురువులు ఆకుల రవి, పతంజలి యోగ గురువు మనోరంజని,తో కలిసి హాజరై కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.యోగా గురువు ఆకుల రవి అధికారులతో ఆసనాలు చేయించారు.అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులు పోలీస్ యంత్రాంగం ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు క్రీడాభిమానులతో కలిసియోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన చేయాలన్నారు.. యోగ అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనంగా గుర్తించబడిందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి, శరీరానికి శక్తి మరియు మనసుకు ప్రశాంతత లభిస్తాయని, యోగా మన శరీరానికి, మనసుకు సమతుల్యతను అందించే సాధనమని తెలిపారు. యోగా సాధన ద్వారా జీవనశైలిలో మార్పు వస్తుందని, అనేక వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఇతర శాఖల అధికారులు పతంజలి, వశిష్ట యోగా సంస్థ ప్రతినిధులు, క్రీడాకారులు ఇతర ప్రభుత్వ విద్యార్థినిలు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# యువతకు క్రీడలే సరైన దారి





- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- భానూరులో టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**రామచంద్రపురం, ఏప్రిల్ 10, ( సిరి న్యూస్ ):**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత శారీరక–మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు.పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి ఆటగాళ్లను ప్రోత్సహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కర్షకుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడు టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు.యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు క్రమశిక్షణతో పాటు ఆరోగ్యాన్ని కూడా పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రవిణ్య





- ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాల సేకరణ
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలపై వినతి

**రామచంద్రపురం, ఏప్రిల్ 10 (సిరి న్యూస్):**

భారతీనగర్ డివిజన్‌లోని ఐక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రవిణ్య సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు పాల్గొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రస్తుతం ఉన్న ఇళ్లను కూల్చి అపార్ట్‌మెంట్‌లు నిర్మించే ప్రతిపాదనపై కాలనీ వాసుల అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ సేకరించారు. ఇప్పటికే ఉన్న ఇళ్లలోనే అభివృద్ధి చేసుకునేలా ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రజలు కోరారు.అదే విధంగా, 2017లో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 221 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదర్శ్ రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.మాజీ కార్పొరేటర్ సింధు కాలనీలోని ఇళ్లకు ఇంటి పన్ను విధిస్తున్న అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలు వినిపించిన సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖలతో చర్చించి త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ ప్రవిణ్య హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ శ్రీకాంత్ మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# న్యూట్రల్ కెమికల్ ఇండస్ట్రీస్ లో భారీ అగ్నిప్రమాదం

- ఆకాశాన్ని తాక్కుతున్న అగ్ని జ్వాల
- పొగతో కమ్ముకున్న పరిశ్రమ ప్రాంతం
- అదుపులోకి తేవడానికి అగ్నిమాపక సిబ్బంది శ్రమ

**జిన్నారం ఏప్రిల్ 10 సిరి న్యూస్**






జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో శుక్రవారం మధ్యాహ్న సమయంలో న్యూట్రల్ కెమికల్ ఇండస్ట్రీస్ డిస్టిలేషన్ ప్లాంటు లో అగ్ని ప్రమాదం సంభవించింది. కార్మికులు స్థానికులు భయందోలనకు గురయ్యారు. రెండు కిలోమీటర్ల వరకు, పొగతో కమ్ముకున్న పరిశ్రమల ప్రాంతాలు, కార్మికులు పొగలో ఉక్కిరిబిక్కిరయ్యారు.రవాణా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎదురైంది.గడ్డపోతారం గ్రామం పరిశ్రమలకు అనుకొని ఉండడంతో గాలి కాలుష్యం పెరిగి శ్వాస తీసుకోవడంలో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘాటు రసాయన వాసనలు, వ్యాపించి భరించలేక, కార్మికులు బయటకు పరుగులు తీశారు.అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## చెరువు పరిరక్షణకు అక్రమాల కూల్చివేత



**అమీన్ పూర్ ఏప్రిల్ 10 సిరి న్యూస్**

అమీన్ పూర్ పెద్ద చెరువు పరిధిలోని సర్వేనెంబర్ 176 లో చెరువును పూడ్చి రాత్రికి రాత్రి మట్టి పోసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. పెద్ద చెరువు ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఈ కూల్చివేత కార్యక్రమంలో ఆర్ ఐ సంగీత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసియన్ల సమ్మె మూడవ రోజు ప్రభుత్వం స్పందించదు యాజమాన్యం చర్చలకు పిలువదు !

- ఇదే తీరు కొనసాగితే ఆర్థికంగా సంస్థకు సరఫరాలో ప్రజలకు తిప్పలు తప్పవు!



**హైదరాబాద్,ఏప్రిల్10,సిరి న్యూస్ :**

తెలంగాణ వ్యాప్తంగా హక్కుల కోసం విద్యుత్ ఆర్టీసియన్ కార్మికులు చేస్తున్న పోరాటం మూడవరోజుకు చేరుకుంది.రెండు కంపెనీలలో 90 శాతం పైగా కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు.ఇలాగె సమ్మె కొమసాగితే కష్టాలు తప్పవని తెలిసినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు.కనీసం జాక్ తో ఇప్పటికి చర్చల ప్రస్తావన తేలేదు.ఇదిలా ఉంటె జోక్యం చేసుకోవాల్సిన విద్యుత్ మంత్రి అసలు సమ్మె పరిస్థితుల గూర్చి అధికారులతో ఇప్పటికి సమావేశం నిర్వహించలేదు.దింతో అటు ప్రభుత్వ మొండి వైఖరి ఇటు తాడోపేడో తేల్చుకుందామన్న ఆర్టీసియన్లు కలగలిసి మున్ముందు విద్యుత్ సంక్షోభం తప్పేలా లేదు.సమ్మె విరమిస్తేనే చర్చలు! జరుగుతున్న వాస్తవ పరిస్థితులను కొందరు యూనియన్ శుక్రవారం ప్రతినిధులు ఉన్నత అధికారి దృష్టికి తీసుకెళ్లగా మొదలు సమ్మె విరమించండి,ఆ తర్వాతే చర్చలు అన్నాడట ఒకవేళ సమ్మె విరమించకుంటే ఉద్యోగుల తొలగింపు తప్పదని హెచ్చరించారట దింతో మరింత అసహనానికి లోనైనా యూనియన్ నాయకులు సమ్మె కొనసాగింపు వైపే మొగ్గు చూపుతున్నారు.అన్ని జిల్లాలో ప్రతి డివిజన్,సర్కిల్ కార్యాలయాల్లో వంట వార్పు నిర్వహిస్తున్నారు.ఈ సమ్మెలో పాల్గొనకున్న అన్ని ప్రధాన సంఘాలు సమ్మెకు మద్దతిస్తున్నాయ్.

## రామాయంపేటలో ఘనంగా హోమియోపతి దినోత్సవం



**రామాయంపేట, ఏప్రిల్ 10(సిరి న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని రామాయంపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో హోమియోపతి మరియు యోగ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హోమియోపతి పితామహుడు హెనెన్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఇందులో భాగంగా ఆయుష్ యోగ శిక్షకులు మద్దెల భరత్ అక్కడికి హాజరైన కౌన్సిలర్లు వైద్య సిబ్బంది మరియు అధికారులకు యోగా శిక్షణకు పై అవగాహన కల్పించారు. ముందుగా వారితో ప్రార్థన చేయించి తర్వాత ధ్యానం చేయిస్తూ దానివల్ల మనిషి మానసికంగా ఎంత వృద్ధి చెందుతాడో తెలపడం జరిగింది. తదనంతరం ప్రాణాయామం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ ప్రాణాయామం చేసేటప్పుడు పాటించే నిబంధనల గురించి వివరించడం జరిగింది. దైనందిన జీవితంలో ఆసనాల వల్ల మానవ శరీరానికి ఎంత ఉపయోగం కలుగుతుందో మరియు ఎలా చేయాలో చూపించారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ గణేష్, చైర్మన్ లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ నవనీత గణేష్, కౌన్సిలర్లు ప్రవీణ్, మాధవి, చరిత, శంకర్ గౌడ్, రంజిత్, సందీప్, స్వప్న, రవి, శ్యామల, మేనేజర్ రఘువరన్, వైద్య సిబ్బంది వెంకటేశం మరియు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# రోడ్డుపై పారుతున్న మురికి నీరు

**ఆదిలాబాద్ (సిరిన్యూస్):**



ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్ స్టార్ స్కూల్ ఎదురుగా ఉన్న రవీంద్రనగర్ కాలనీలో మురికి నీరు రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వెదజల్లు తోందని కాలనీ వాసులు, వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి నీరు రోడ్డుపై చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితమే మురికి కాల్వలో పూడికలు తీసి పనులు ప్రారంభిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యేక చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. స్థానికులు, సమీపంలోని స్కూల్ పిల్లలు రోగాల బారిన పడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రేచిని రైతు వేదికలో అక్షరాభ్యాసం

**తాండూర్ (సిరిన్యూస్):**




తాండూర్ సెక్టార్ పరిధిలోని రేచిని రైతు వేదికలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడబ్ల్యూఓ రఫ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించి, అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 65 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ సందర్భంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వరూపరాణి, సూపర్వైజర్ స్వరూపరాణి, రేచిని గ్రామ సర్పంచ్ పోతరాజుల రాంబాయి, టీచర్లు శారద, పావని, అరవింద, మల్లుబాయి, రజిత, అర్చన, హెల్పర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేట జీపీలో లోవోల్టేజ్ సమస్యకు చెక్



**బెజ్జూర్ (సిరిన్యూస్):** మండల పరిధిలోని పాపన్నపేట గ్రామపంచాయతీలో నెలకొన్న లోవోల్టేజ్ విద్యుత్ సమస్యను సర్పంచ్ భుజాడి అనసూర్య సుధాకర్ పరిష్కరించారు. గ్రామంలో లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో గ్రామంలోని అంబేద్కర్ కాలనీ, భుజాడివాడ ప్రాంతాల్లో రెండు డీటీఆర్‌లు ఏర్పాటు చేయించి లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం కల్పించారు. దీంతో కాలనీ వాసులు, గ్రామస్తులు సర్పంచ్, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భుజాడి అనసూర్య సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ మండల బీఆర్ఎస్ పార్టీ యువజన కన్వీనర్ దుర్గం తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ సేవలు గ్రామానికి ఆదర్శం

## విద్యార్థులకు ప్లేట్లు అందజేత, అన్న వితరణ



**తాండూర్ (సిరిన్యూస్):** మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన ఉమ్మడి ద్వారాకపూర్ మాజీ సర్పంచ్ దివంగత సాత బానయ్య సేవలు గ్రామానికి ఆదర్శమని సర్పంచ్ ముదాం వనజ అన్నారు. ఆయన రెండో వర్ధంతి సందర్భంగా ఆయన సభ్యులు శుక్రవారం కాసిపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత మాజీ సర్పంచ్ సాత బానయ్య ఉమ్మడి ద్వారాకపూర్ పంచాయతీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలను స్మరించుకుంటూ విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కస్తూరి మాధురి, శ్రీధర్, ఉప సర్పంచ్ బోయిని సుమలత, మాజీ గ్రంథాలయ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ జెడ్పీటీసీ సాలిగాం బానయ్య, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, వార్డు సభ్యులు గోవర్ధన్, గోపాల్, తిరుపతి, రమేష్, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చెలరేగుతున్న మట్టిమాఫియా..!

**ఝరాసంఘం,ఏప్రిల్ 10(సిరిన్యూస్)**

ప్రకృతి సహజ సంపదలో సహజసిద్ధమైన గుట్టలు మాయమై పెద్ద పెద్ద చెరువులను తలపిస్తున్నాయ్.ఎర్రమట్టి అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు.ప్రభుత్వ భూముల్లో, మైనింగ్ క్వారీలలో మట్టి మాఫియా దర్జాగా పెద్ద టిప్పర్ లతో ఎర్రమట్టిని తరలిస్తూ,కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, ప్రభుత్వ భూముల్లో మట్టి తీయడానికి తరలించడానికి రెవెన్యూ శాఖ పరమైన అనుమతుల తో పాటు గ్రామం చుట్టుపక్కల మైనింగ్ జరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతంలో మట్టిని తరలించాలన్నా మైనింగ్ కార్పొరేషన్ ద్వారా అనుమతులు తీసుకోవాలి. అదేవిధంగా ఏ గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుందో ఆ గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకొని మట్టి తరలించాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీకి కూడా కొంత రాయల్టీ రూపంలో చెల్లించుకోవాలి,అదేవిధంగా రెవెన్యూ యంత్రాంగానికి కొంత రాయల్టీ రూపంలో చెల్లిస్తేనే మట్టి తరలింపుకు అనుమతులు ఇస్తారు. ఇవేమీ లేకుండా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయాన్ని గండికొడుతూ కొందరు అక్రమార్కులు మట్టి దందాను కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎర్రమట్టి తరలించే క్రమంలో ఎవరైనా త్రవ్వకాలలో అడ్డుకోవాలని చూస్తే వారిపై దౌర్జన్యానికి దిగుతూ దాడులు చేస్తున్నారు అని, ఈ రకంగా మాఫియా రెచ్చిపోవడంతో వారికి అడ్డు చెప్పడానికి గ్రామ ప్రజలు సైతం భయపడుతున్నారు. మట్టి తరలిస్తున్నప్పుడువాహనాల గుండా వచ్చే పొగ, దుమ్ము, దూళి లతో అనేక ఇబ్బందులు క లుగుతున్నాయి. కొండ లు, గుట్ట లు తవ్వడం ద్వారా ప్రకృతి సమాతుల్యత దెబ్బతిని భూకంపాలు, అతివృష్టి, అన్నావృష్టి పరిస్థితులు ఏర్పడుతాయి.అధికారులు మారుతున్నారు, కానీ అక్రమ దారుల తీరు మరట్లేదు ఇప్పటికైనా అధికారులు ఎర్ర మట్టి మాఫియా పై చర్యలు తీసుకొని తమ గ్రామ సహజ సంపద అయిన ఎర్రమట్టిని తరలించకుండా చూడాలని వేడుకుంటున్నారు"








# కాట్రియాల, ఆర్ వెంకటాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**రామాయంపేట, ఏప్రిల్ 10(సిరి న్యూస్)**

రామాయంపేట మండలంలోని కాట్రియాల, ఆర్ వెంకటాపూర్ గ్రామాల్లో శుక్రవారం నాడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. ఆర్ వెంకటాపూర్ గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. అందులో భాగంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ప్రభుత్వం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుందని ఆమె వివరించారు. రైతులందరూ దళారుల జోలికి పోవద్దని కోరారు, కాట్రియాల గ్రామంలో గిట్టుబాటు ధర కల్పించడం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని రామాయంపేట మండలం కాట్రియాల గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా సూచించారు. గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఉపసర్పంచ్ బాబు నాయక్ తో కలిసి ఆమె ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. అంతకుముందు ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ స్రవంతి ప్రారంభించారు. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత వ్యాక్సినేషన్ పంపిణీ చేపట్టిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సీసీ విజయలక్ష్మి,వివోఏ లు కమ్మరి శ్యామల, రాజు,కమ్మరి రమేష్ చారి, సుధాకర్ రెడ్డి, దుర్గా నాయక్, కాట్రియాల సిద్ధ రాములు, కాట్రియాల బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఈ హాస్టల్ లో ఉండలేం బాబోయ్.?

- 120 మందికి ఒక్కటే పరిశుభ్రత లేని టాయిలెట్.
- పాచి పోయిన భోజనం నాణ్యతలేని వంట
- మొరపెట్టుకున్న పంట్టించుకొని ప్రిన్సిపాల్
- ప్రతి రోజు పాములతో బిక్కు బిక్కు మంటున్న పట్టించుకోరు.
- రోడ్డెక్కి న్యాయం చేయాలనీ రాస్తారోకో చేసిన నర్సింగ్ విద్యార్థినులు



**మెదక్,ఏప్రిల్ 20(సిరిన్యూస్)**

ఇలాంటి హాస్టల్ లో వుండలేం బాబోయ్ అంటూ మెదక్ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు శుక్రవారం రోడ్డెక్కి రాస్తారోకో చేసిన ఘటన మెదక్ లో జరిగింది. వివరాల్లోకి వెళ్ళితే మెదక్ గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ విద్యార్థుల బాధలు వర్ణనతితంగా ఉన్నాయి.120 మంది విద్యార్థులకు గాను ఒక్కటంటే ఒక్కటే టాయిలెట్ అదికూడా అపరిశుభ్రంగా కంపుకొడుతుందన్నారు.పాచి పోయిన అన్నం పెట్టి రుచిలేని కూరలతో పస్తులుంటున్నామన్నారు.హాస్టల్ రూంలలో ప్రతిరోజు అర్ధరాత్రి పాములతో బిక్కు బిక్కు మంటున్న పట్టించుకోవడం లేదన్నరు.అడ్మిషన్ కింద ప్రతి విద్యార్థి నుండి రు. 20 వేలతో పాటు మెస్ ఛార్జిలకు ప్రతి నెల రూ . 6వేలు చెల్లిస్తున్నమని తెలిపారు.అయినా జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని వాపోయారు.ప్రతి నెల డబ్బులు చెల్లిస్తున్న నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు.ఒక్కటే టాయిలెట్ లో అందరు వెళ్ళితే ఎలా ఉంటుందని, కనీసం శుభ్రం చేయించుమని మొరపెట్టుకున్న, పాములు వస్తున్నాయని చెప్పిన ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పిల్లి కొట్టాల్ నుండి దాదాపు మూడు కిలో మీటర్లు ఎండలో వచ్చి నిరసన వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షులు మందాపురం సతీష్ విద్యార్థులకు మద్దతు ప్రకటించారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి కోరారు.ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విద్యార్థులను బస్సులో కలెక్టరేట్ కు తరలించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.



# చిత్తడి నేలగా గుర్తించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల (సిరిన్యూస్):**

జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఉన్న చెరువును చిత్తడి నేలగా ప్రకటించేందుకు రాష్ట్రస్థాయిలో జరగనున్న సమావేశానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యతో కలిసి రెవెన్యూ, మత్స్య, నీటిపారుదల, వ్యవసాయ, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్రావుపేట గ్రామంలోని చెరువు సుమారు 132 ఎకరాల విస్తీర్ణంలో ఉందని తెలిపారు. ఈ చెరువు వలస పక్షులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతమని, ప్రతి ఏడాది వివిధ దేశాల నుంచి వలస పక్షులు ఇక్కడికి వచ్చి నివాసాలు ఏర్పర్చుకుంటాయని పేర్కొన్నారు. ఈ చెరువును చిత్తడి నేలగా ప్రకటించడం ద్వారా వలస పక్షులతో పాటు స్థానిక పక్షులకు కూడా సురక్షితమైన ఆవాసం కల్పించవచ్చని తెలిపారు. గ్రామస్తులు, నీటిపారుదల, రెవెన్యూ, మత్స్య, పర్యాటక శాఖల అధికారులు ఈ ప్రతిపాదనకు అభ్యంతరం లేకుండా అంగీకరించారని అన్నారు. చిత్తడి నేలగా ప్రకటిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యే అవకాశముందని, తద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సమావేశానికి ముందుగానే అన్ని వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేగాన్ని నియంత్రించండి ప్రమాదాలకు చెక్ వేయండి

**ఆసిఫాబాద్ (సిరిన్యూస్):** ఆసిఫాబాద్ పట్టణంలోని భాగ్యనగర్ ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ నుంచి పాత ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వరకు ఉన్న రహదారి ఒకప్పుడు గుంతలతో నిండిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించేది. అనంతరం ప్రభుత్వం కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ప్రస్తుతం ఈ మార్గం సాఫీగా, ప్రయాణానికి అనుకూలంగా మారింది. అయితే ఈ అభివృద్ధి మరో సమస్యకు దారి తీసింది. కొత్తగా నిర్మించిన రోడ్డు కారణంగా బైక్ వాహనదారులు అధిక వేగంతో ప్రయాణించడం ప్రారంభించారు. వేగ నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా కూడా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి కాలు విరిగినట్టు సమాచారం. ఇలాంటి ఘటనలు స్థానిక ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం వేగ నియంత్రణ చర్యలు లేకపోవడమేనని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి ఎంత బాగున్నా, తగిన భద్రతా చర్యలు లేకపోతే అది ప్రమాదాలకు కారణమవుతుందని అంటున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా ట్రాఫిక్ పోలీసులు కఠినంగా నిబంధనలు అమలు చేసి, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై జరిమానాలు విధించాలని చెబుతున్నారు. ప్రజల్లో కూడా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, వేగం కంటే ప్రాణం ముఖ్యమని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం వంటి అంశాల్లో బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. అభివృద్ధితో పాటు భద్రత కూడా సమానంగా ఉండాలని, ఎక్స్ రోడ్ నుంచి పాత చెక్‌పోస్ట్ వరకు ఉన్న ఈ మార్గాన్ని ప్రమాద రహితంగా మార్చేందుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కలిసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పంచాయతీ సిబ్బంది కాంబ్లే బాబూరావుకు మనోధైర్యం

## • సర్పంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**గుడిహత్నూర్(సిరిన్యూస్):** గ్రామ పంచాయతీ సిబ్బంది గాయ్ కాంబ్లే బాబూరావు కుటుంబానికి గ్రామ సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్ మనోధైర్యం కల్పించారు. ఎన్నో సంవత్సరాలుగా బాబూరావు కుటుంబంలోని నలుగురు సభ్యులు గ్రామ పంచాయతీకి సేవలు అందిస్తూ ఆదర్శ కుటుంబంగా నిలిచారని తెలిపారు. ఇటీవల అనారోగ్య కారణాలతో బాబూరావు భార్య గంగుబాయి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ గ్రామ పంచాయతీ తరఫున రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గంగుబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని



ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కారోబారి అమీన్, వార్డు సభ్యుడు హరి తదితరులు పాల్గొన్నారు.

# బ్లూలియో ఎనర్జీ ప్రైవేట్ పరిశ్రమకు నోటీసులు జారీ


**హత్నూర(సిరిన్యూస్):**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న బ్లూలియో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యానికి గ్రామ సెక్రటరీ స్వప్న శుక్రవారం నోటీసులు జారీ చేశారు. పరిశ్రమ నిర్మాణానికి గ్రామపంచాయతీ తీర్మానం, అనుమతులు లేవని స్థానిక గ్రామ ప్రజలు ఆరోపిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు పేర్కొన్నారు.



# ఆచార్య సుప్రసన్నచార్యకు సత్కారం

**వరంగల్ (సిరిన్యూస్):** ఓరుగల్లు సాహితీ వారసత్వ సంపదగా నిలిచిన ఆచార్య కోవెల సుప్రసన్నచార్యను కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ చిర్ర రాజు ప్రశంసించారు. ఆచార్య కోవెల సుప్రసన్నచార్య 90వ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డాక్టర్ చిర్ర రాజు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ సాంప్రదాయ సాహిత్యాన్ని ఆధునిక సాహిత్య ధోరణులతో సమన్వయం చేస్తూ తెలుగు సాహిత్య రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప సాహిత్యకారుడు ఆచార్య కోవెల సుప్రసన్నచార్య అని కొనియాడారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో దిగంబర కవిత్వానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన చేతన వర్థ కవులలో ఒకరుగా ఆయన విశిష్టమైన సాహిత్య సృజన చేసి ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ కర్రె సదాశివ్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, బ్రహ్మశ్రీ అనురామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# వివాహ వేడుకల్లో కుంరం కోటేష్




**ఇచ్చోడ(సిరిన్యూస్):** ఇచ్చోడ మండలం మల్యాల్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కుంరం వంశస్తుల వివాహ వేడుకల్లో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కుంరం కోటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్యాల్ సర్పంచ్ మెస్రం దేవురావ్, సిడం గంగారాం పటేల్, బోథ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకుడు ఆత్రం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



**బేల (సిరిన్యూస్):** బేల మండలం భాది గ్రామంలో రూ.11 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ దంతెల వినోద్ తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ వహాబ్, సీనియర్ నాయకులు సర్దార్ ఖాన్, కొప్పుల అశోక్, నగోషే బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బూత్ ఏజెంట్లకు నియామక పత్రాల అందజేత




**ఆదిలాబాద్(సిరిన్యూస్):** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు పలువురు బూత్ ఏజెంట్లకు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిబద్ధత కలిగిన కాంగ్రెస్ కార్యకర్తలకు బూత్ ఏజెంట్ల బాధ్యతలు అప్పగించేలా పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. నియామక ప్రక్రియలో భాగంగా బూత్ ఏజెంట్ల నుంచి ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లోకండే దేవరావ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోడి ప్రభాకర్, రాపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతి..

## ఇకపై 40 శాతం మరణాలు నివారించవచ్చు

ప్రపంచ వ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడేవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దీనికి ప్రధాన కారణం చివరి దశలో ఈ క్యాన్సర్ గుర్తించడమే. అయితే తాజా పరిశోధనలు ఈ క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతిని కనుగొన్నారు. దీని ద్వారా 40 శాతం మరణాలను అడ్డుకోవచ్చంటున్నారు పరిశోధకులు.. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రొమ్ము క్యాన్సర్ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక సంఖ్యలో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుయి. మరణాల పరంగా రొమ్ము క్యాన్సర్ కంటే గర్భాశయ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా దాదాపు 4 లక్షల మంది మహిళలు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ కేసుల్లో చాలా వరకు చివరి దశలో అభివృద్ధి చెందుతాయి. ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది. దీంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పరిశోధకుల రీసెర్చ్ ఈ వ్యాధి చికిత్సలో గొప్ప విజయాన్ని సాధించారు. ఈ చికిత్సతో సర్వైకల్ క్యాన్సర్ మరణాలను 40 శాతం తగ్గించవచ్చని అంటున్నారు.



### ఈ కొత్త టెక్నాలజీతో సర్వైకల్ క్యాన్సర్ చికిత్స...

**పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ కేసుల దృష్ట్యా.. వైద్యులు మెరుగైన చికిత్సను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. సంవత్సరాలుగా దానిపై అధ్యయనాలు చేస్తున్నారు. ఇటీవల వైద్యులు దాని చికిత్సలో సానుకూల ఫలితాలను పొందారు. ఈ పరిశోధనకు యూకే, మెక్సికో, భారత్, ఇటలీ, బ్రెజిల్‌లతో సహా 10 సంవత్సరాలకు పైగా ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలను తీసుకున్నారు. ఈ చికిత్సలో కెమోరేడియేషన్‌కు ముందు కీమోథెరపీని చిన్న సెషన్‌లు ఇచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ నేతృత్వంలోని ఈ పరిశోధన మూడవ, నాల్గవ దశ క్యాన్సర్ చికిత్సలో చాలా మంచి ఫలితాలను చూపించింది. ఫలితంగా ఈ వ్యాధి నుండి మరణించే ప్రమాదాన్ని 40 శాతం తగ్గించవచ్చని తేలింది. పైగా ఈ క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం 35 శాతం తగ్గింది కూడా. మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన ఫేజ్ 3 ట్రయల్‌లో విజయవంతమైనట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త చికిత్స విధానంపై పెద్ద ఎత్తున పరిశోధన చేయనప్పటికీ, ఈ పరిశోధన ఫలితాలు గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో గొప్ప విజయంగా భావిస్తున్నారు.**



### ప్రతి ఏడాది 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల్లో సగానికి పైగా మరణిస్తున్నారు. దీని బారిన పడిన స్త్రీలలో చాలా మంది దాదాపు 50 సంవత్సరాల వయస్సు గలవారు ఉంటున్నారు. 30 నుండి 40 శాతం కేసులలో ఈ క్యాన్సర్ నయమైన తర్వాత మళ్లీ తిరిగి వస్తుంది. రెండో సారి తిరగబెట్టినప్పుడు ఇది మరింత ప్రాణాంతకంగా మారి మరణానికి కారణమవుతుంది. గర్భాశయ క్యాన్సర్‌లో మరణాల సంఖ్య పెరగడానికి కారణం ఆలస్యంగా గుర్తించడమే. చాలామంది మహిళలు నాల్గవ దశలో ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆధునాతన చికిత్సను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించి, చికిత్స చేసేందుకు సాధ్యమవుతుంది . తద్వారా మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### గర్భాశయ క్యాన్సర్‌ను ఎలా నివారించాలి...

- △ ధూమపానం మానుకోవాలి
- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉండటం
- △ చిన్నవయసులోనే శారీరక సంబంధాలు పెట్టుకోకపోవడం మంచిది
- △ గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా తీసుకోకూడదు
- △ సర్వైకల్ క్యాన్సర్‌ను పరీక్షించడానికి ఎప్పటికప్పుడు పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి
- △ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేయించుకోవాలి



### గర్భాశయ క్యాన్సర్ ఎందుకు వస్తుంది...?

- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలను కలిగి ఉండటం
- △ ధూమపానం
- △ గర్భనిరోధక మాత్రలు అధికంగా తీసుకోవడం కలిగి ఉండటం

### వెన్నునొప్పితో బాధపడుతున్నారా?

# ఇలా చేస్తే ఉపశమనమే..



ప్రస్తుత రోజుల్లో చాలామంది ఒకే చోట కదలకుండా గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటారు. దీని వల్ల వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను ఇలాగే వదిలేస్తే అనతి కాలంలోనే సమస్య తీవ్రం అవుతుంది. ఇలా అవకుండా ఉండాలంటే.. గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వెన్నుపాము నొప్పి రావడం సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్య ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుంది. కానీ కొంతమందిలో ఇది చాలా కాలం పాటు కొనసాగుతుంది. దీనివల్ల ఏ పని చేయాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. చాలా మంది వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వెన్నెముక కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా హెర్నియేటెడ్ డిస్క్, వెన్నునొప్పి, పార్శ్వగూని వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని ఢిల్లీలోని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్‌లో వెన్నెముక సేవల చీఫ్ డాక్టర్ వికాస్ టాండన్ అంటున్నారు. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, కీళ్లనొప్పులు, వెన్నుపాము దెబ్బతినడానికి కూడా దారితీయవచ్చు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ చిరోప్రాక్టిక్ ద్వారా అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని జరుపుకుంటామని డాక్టర్ వికాస్ టాండన్ వివరించారు. ఇది 2008లో ప్రారంభమైంది. వెన్నెముకకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశం. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, చెడు భంగిమ, బలహీనమైన జీవనశైలి, గాయం వెన్నెముకలో నొప్పికి కారణమవుతుందని డాక్టర్ వికాస్ వివరిస్తున్నారు. ఈ నొప్పి ప్రారంభంలో స్వల్పంగా ఉంటుంది. తరువాత క్రమంగా పెరుగుతుంది. కానీ దానిని విస్మరించకూడదు. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే మంచి భంగిమలో కూర్చోవాలి. లేవడం, కూర్చోవడం, నడిచే విధానం సరిగ్గా ఉండాలి. సరిగ్గా కూర్చోవడం మన మెదడుపై అనేక విధాలుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది వెన్నెముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నిటారుగా కూర్చోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. నిటారుగా కూర్చుంటే శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జీవనశైలిని చక్కగా ఉంచుకోవాలి. ప్రతిరోజూ యోగా చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని చేర్చుకోవాలి.

# గర్భిణీలు స్మోకింగ్ చేస్తే.. అతి ప్రమాదకరం

పొగతాగడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు స్మోకింగ్ ప్రధాన కారణం. అందుకే ఈ అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలు మొదలు ఎముకలు, మెదడు ఆరోగ్యంపై కూడా స్మోకింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే గర్భిణీలు ఒకవేళ స్మోకింగ్ చేస్తే మరింత ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మోకింగ్ వల్ల గర్భిణులకు తీవ్ర అనర్థాలు తప్పవని అంటున్నారు. సిగరెట్ పొగలో ఏకంగా నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి.



**సాధారణంగా స్మోకింగ్ చేసే వారిలో ఈ రసాయనాలు రక్తంలో కలిసిపోతాయి. దీంతో ఈ రసాయనాలు ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. ఇది శిశువు ఎగుదలకు, మానసిక అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని అధ్యయనంలో తేలింది. అంతేకాకుండా స్మోకింగ్ చేయడం వల్ల గర్బిణీ హృదయ స్పందనల రేటుపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో డెలివరీ సమయంలో తల్లి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.**

అయితే గర్భం దాల్చకముందు సిగరెట్ అలవాటు ఉండి. గర్భం దాల్చిన తర్వాత మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశం 27 శాతం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో కూడా స్మోకింగ్ చేస్తే ఈ ముప్పు 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వేలో తేలింది. గర్భిణీలు స్మోకింగ్ చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కచ్చితంగా నేరుగా ప్రమాదం పడుతుందని, తల్లి కావాలనుకునే వారు కనీసం 6 నెలల ముందు నుంచి ఈ అలవాటును మానేయడం ఉత్తమం అని చెబుతున్నారు.